31.

# సర్వం విష్ణుమయం జగత్

**మానం హిత్వా ప్రియోభవతి క్రోధం హిత్వా నశోచతి**
**కామం హిత్వార్థవాన్ భవతి లోభం హిత్వా సుఖీభవతి.**

ప్రేమస్వరూపులారా!

మానవునకు అహంకారము ఉండినంతవరకు ఎవ్వరు అతనిని ప్రేమించరు. కట్టుకున్న భార్య మొదలు కన్న కుమారునివరకు ప్రాపంచ నిమిత్తమై వారు గౌరవింతురే గానీ నిజముగా నీ అహంకారము చూసి వారుకూడా అసహ్యించుకుందురు. ఈ అహంకారము మానవుని యందుండినంతవరకు అతనికి కూడా ఎట్టి ఆనందము లభించదు. కనుక మానవుడు మొదట అహంకారము నశింపచేసుకోవాలి. క్రోధముండినంతవరకు యితనికి ఆనందము లభించదు. ఆ క్రోధము తనయందున్నంత వరకు దుఃఖమే. ఏనాడు మానవుడు క్రోధమును నశింపచేసుకొనునో అప్పుడే తాను సుఖమును అనుభవిస్తాడు. వాంఛలుండినంతవరకు ఏవిధమైన సంపద అతనికి దొరకదు. ఏనాడు మానవుడు వాంఛలను వదలునో అప్పుడే సర్వసంపదలు అతన్ని కూడి వస్తాయి. లోభముండినంతవరకు మానవునికి సుఖము కనిపించదు. ఏనాడు లోభమును దూరము గావించుకొనునో ఆనాడే మానవుడు సర్వసుఖములు అనుభవిస్తాడు.

**అణోరణీయాన్ మహతో మహీయాన్**

ప్రేమస్వరూపులారా! ప్రపంచమంతయు అణుశక్తిపై ఆధారపడి ఉంటున్నాది. అణువుకంటె సూక్ష్మమై అణువు అగుచు, ఘనము కంటె స్థూలమై ఘనము అగుచు పరమాత్ముడు అంతటా నిండియున్నాడు. అణువుయే ఆత్మ, ఆత్మయే అణువు అగును. ఈ అణుశక్తి యొక్క శక్తి ఎవరు గుర్తించుకోలేరు. పలికే పలుకు, చూచే చూపు, వినే శబ్దము, నడచే నడక అణుస్వరూపమైన శక్తియే. ప్రతి ప్రాణి చలనము అణువు యొక్క స్వరూపమే. ఏది అనుభవించినా అణువు యొక్క ప్రభావమే. ఈ సత్యాన్ని యీనాటి సైంటిస్టులు వేయి

srisathyasaivachanamrutam

సంవత్సరముల తరువాత తెలుసుకోగలిగారు. ఈ అణుశక్తిని గుర్తించటానికి వేయి సంవత్సరముల కాలము పట్టింది. కానీ ఏనాడో బాలుడైన ప్రహ్లాదుడు, విద్యార్థియైన ప్రహ్లాదుడు ఆనాడే గుర్తించాడు.

**'ఇందుగలడందులేడని**
**సందేహము వలదు చక్రి సర్వోపగతుం**
**డెందెందు వెదకి చూచినా**
**నందందే గలడు'**

అని తాను నిర్ణయము చేశాడు. ప్రహ్లాదుడు ఎట్టి పరిశోధనలుగానీ, ఎట్టి పరిశీలనలుగానీ సల్పలేదు. నిర్మల నిశ్చలమైన చిత్తమునకు సర్వము సత్య స్వరూపమే గోచరిస్తుంది.

**అణువు కంటెను సూక్ష్మమై అణువు అగుచు**
**ఘనము కంటె ఘనముయై తానె వెలుగు**
**ఆత్మయె అణువు అణువుయే ఆత్మయగును**

ఇట్టి సత్యాన్ని గుర్తించిన విద్యార్థి బాలుడు ప్రహ్లాదుడు. దీనిని ఆధారము చేసుకున్న ప్రపంచమంతయు దైవమయమే, దైవ స్వరూపమే. ప్రతి పదార్థము నందు అణుశక్తియే ప్రసరిస్తున్నది. ఈ అణువు లేని వస్తువుగానీ, అణువులేని స్థానముగానీ అణువు గానీ రూపముగానీ ఎక్కడ మనకు కానరాదు. సమస్త పదార్థములు అణుస్వరూపమే. ఈ జగత్తునందు ప్రతివ్యక్తి చిన్న జనరేటరే. ఇతని యందున్న అయస్కాంతమే విద్యుత్‌శక్తిగా మారుతున్నది. శక్తి ప్రభావము చేతనే మనిషి నడవగల్గుతున్నాడు, మాట్లాడగలుగుచున్నాడు. వినగలుగుతున్నాడు, తినగలుగుతున్నాడు. ప్రతి మానవుని హృదయము ఒక రేడియో సోర్స్. ప్రతి మానవుని శక్తి కేవలము అణుశక్తియే. దీనిని పురస్కరించుకొనే ఐన్‌స్టీన్ matter, energy రెండూ ఒకటే అని ప్రకటించాడు. ఈవిధమైన సైన్సు పరిశోధన ద్వారా చివరికి జగత్తంతయు బ్రహ్మమయమే అని చెప్పినట్లయింది. కానీ పేర్లు మార్చారు. సైంటిస్టులు అణుమయము అన్నారు. వేదాంతులు బ్రహ్మమయము అన్నారు. సైన్సు చెప్పినది, సెయింట్ చెప్పినదీ ఏకత్వమే, ఏమాత్రము భేదము లేదు. ఇక్కడ

srisathyasaivachanamrutam

గణపతి అని పదము ఉంటున్నాది. గ-అనగా బుద్ధి. ణ-అనగా జ్ఞానము. జ్ఞానవిజ్ఞానములకు పతియే గణపతి. ఈ జ్ఞాన విజ్ఞానములకు పతియైన గణపతిని ఆరాధించటం గణపతి ఆరాధనే. గణపతి కూడా శక్తి సమూహమే. ఇంతేకాక సమస్త గణములకు తాను అధిపతియైనవాడు. మరొక రూపములోపల వినాయక అని పిలుస్తూ వచ్చారు. ఇతనికి వేరే నాయకుడు లేడు. సర్వమునకు నాయకుడు ఇతనే. ఇతన్నే మరొకరూపములో విఘ్నేశ్వర అని పిలుస్తూ వచ్చారు. విఘ్నేశ్వరుడు అనగా సమస్త ఐశ్వర్యములకు నాయకుడు, సకలైశ్వర్య స్వరూపుడు. అన్నీ కూడా శక్తి స్వరూపములే.

**సకలైశ్వర్యములు**

ఏమిటి ఈ సకలైశ్వర్యములు? శబ్దబ్రహ్మము, చరాచరము, జ్యోతిర్మయము, విద్యామయము, అణుమయము, సర్వము యీ అణువు యొక్క శక్తులే. జ్యోతిర్మయము కూడా అణుస్వరూపమే. ఈ జ్యోతి ఎక్కడ ఉంటున్నాది. ప్రతి ప్రాణియందు విద్యుత్ శక్తి రూపములో ప్రసరిస్తున్నాది. ఈ విద్యుత్ శక్తి లేని ప్రాణి కనిపించటం లేదు లోకములో. కనుక ప్రతి ప్రాణి శరీరము ఒక విధమైన జనరేటరే. మనం విద్యుత్‌శక్తికి ప్రత్యేకంగా ప్రయత్నం చేసి సాధించనక్కరలేదు. ఈ దేహమంతయు కేవలము అయస్కాంత స్వరూపమే. అయస్కాంతము నుండి అయస్కాంతమే వస్తుంది కానీ మరొకటి రాదు. అయితే వీటి రూపములు వేరు వేరు కావచ్చు గానీ శక్తి ఒక్కటే. బల్బు వెలిగినా ఫ్యాను తిరిగినా, స్టౌ వంట చేసినా, మిషను పనిచేసినా కరెంటు ఒక్కటే. దీన్ని విద్యుత్ శక్తి అన్నా, కాంతిశక్తి అన్నా, ఉష్ణశక్తి అన్నా, అయస్కాంతశక్తి అన్నా, లేజరుశక్తి అన్నా లేక ఏ విధమైన పేరుతో పిలిచినను దివ్యమైన ప్రభావాన్ని గురించియే యీ అయస్కాంత కర్మ ప్రబోధిస్తూ వచ్చింది. పలికే పలుకు, చూచే చూపు, వినే శబ్దము, నడచే నడక, తినే తిండి, త్రాగే నీరు అన్నీ విద్యుత్‌శక్తి యొక్క లక్షణములే. ఈ జలము నందు బడబాగ్ని అనే శక్తి ఉంటున్నాది. అదియే విద్యుత్ శక్తి. ఏ అగ్నిని జలము ఆర్పుతున్నదో అలాంటి ఆర్పగలిగే జలమునందే యీ విద్యుత్‌శక్తి కూడా అంతర్గతముగా కలదు. కనుక సర్వం బ్రహ్మమయం, ఈ జగమంతా బ్రహ్మమయం. దీనినే విష్ణుమయం జగత్ అన్నారు. కనుక గణపతి వేరు, విష్ణువు వేరు, శివుడు వేరు, శక్తి వేరు, మానవుడు వేరు అనే బేధములు మనం వేరు

srisathyasaivachanamrutam

చేయాలి. సర్వులయందు మానవత్వము సమానమై ఉంటున్నాది. ఇది ప్రాకృత శక్తికి సరైన రూపకంగా నిరూపిస్తున్నాది. అయితే ఇవి ప్రవృత్తి యొక్క లక్షణములే గానీ నివృత్తి లక్షణములు కాదు. ఈ నివృత్తి రూప రహితంగా సర్వులయందు ప్రసరిస్తున్నాది. అదియే అణుశక్తి. ఈ భౌతికమైన ప్రాకృతిక శక్తిని పోషించే నిమిత్తమై ఈ అణుశక్తియందు అనేక రకములైన మార్గములు బోధించారు.

**నాయకుడు లేని వినాయకుడు**

ఈ వినాయకచవితి దినము వినాయకునికి ఏమి అర్పితము చేస్తున్నారు. ఈ అర్పితము చేసే సమస్త పదార్థములు ఏవిధమైన తైల సంస్కారము లేకుండా తయారచేసిన వస్తువులే వినాయకునకు అర్పితము చేస్తుంటారు. బియ్యము ఉడికించి దానిని ముద్దగా చేసి ఆ ముద్దల లోపల నువ్వులను ఉడికించి దానిలో బెల్లము వేసి దానిని బియ్యము పిండిలో కలిపి నైవేద్యముగా పెడుతున్నారు. తైలసంస్కారము ఎక్కడా కనిపించటం లేదు. దీనికోసమే విఘ్నేశ్వరుని పండుగ వచ్చిందంటే కుడుములు, ఉండ్రాళ్లు చేస్తారు. తైల సంస్కారము లేనివి. దీనివల్ల కలిగే ఫలితము ఏమిటి? అని విచారణ చేస్తే తైల సంస్కారము కాని పదార్థములు అతి త్వరగా జీర్ణమవుతాయి. నువ్వులవల్ల వాత పిత్త శ్లేషాదులు తగ్గిపోతాయి. బెల్లము వల్ల కన్నులలోని శక్తులు చాలా వరకు అభివృద్ధి అవుతాయి. అన్నీ ఆరోగ్య నిమిత్తమై ఏర్పడిన ప్రసాదములే గానీ నైవేద్య నిమిత్తమై ఏర్పడిన ప్రసాదములు కాదు. ఈ దేహమైన అణుశక్తిని పదార్థములశక్తిచేత పవిత్రము గావించి తద్వారా అమిత ఆయుష్షును అభివృద్ధి పరుస్తుంది. వినాయకుడికి తెలివితేటలు చాలా గొప్పవి. వినాయకుని చూస్తే చాలామంది ఆనందిస్తుంటారు. ఆ రూపమే చిత్ర విచిత్రమైనదిగా కనిపిస్తుంది. పెద్ద బొజ్జ, చక్కని తొండము. ఆకర్షించే కన్నులు మంచి చెవులు. అయితే ఎందుకోసం ఏనుగు శిరస్సు ఉంచారు? గజమునకు తెలివితేటలు గొప్పవి. మృగములలో చాలా పెద్ద శరీరము కల్గినది. ఏ మృగమునకు ఏనుగువంటి పెద్ద శరీరము లేదు. మృగరాజైన సింహము పాదప్రింటును కూడా మూసివేసేంత పెద్ద పాదప్రింటు ఉన్నది గజమునకు. దాని తెలివితేటలు మరొక మృగమునకు లేదు. ఇంతేకాక మానవులందరకు మార్గ దర్శకమైనది యీ గజము. అడవులలో ఎవరు సంచరించవలెనన్నను పొదల మధ్య, చెట్ల మధ్య ఎవరు

sri sathyasaivachanamrutam

కూడా సులభంగా సంచరించలేరు. ఒక్కతూరి గజము ప్రయాణము చేసిందంటే అక్కడంతా దారి ఏర్పడుతుంది. అప్పుడు ఏ మనిషైనా సులభంగా దారి చేసుకుని వెళ్ళిపోవచ్చును. కాబట్టి జీవితారణ్యము లోపల అనేక కష్టములు, నష్టములు, దుఃఖములు, విచారములనే పొదలున్న అరణ్యమునందు తెలివితేటలు ముందుగా బయలుదేరితే ఎంతైనా సులభముగా ప్రయాణముచేయవచ్చు. ఇట్టి గజము యొక్క శిరస్సు ధరించినవాడు కాబట్టే గణపతికి తెలివితేటలుఎక్కువ అన్నారు. ఒకనాడు తల్లిదండ్రులు, పార్వతీ పరమేశ్వరులు చేరి గణపతి తెలివితేటలు పరీక్షించాలని ప్రయత్నం చేశారు.

**వినాయక విజయము**

ఇరువురు కుమారులు సమీపించి నాయనలారా! మీరు ఒక్కసారి యీ విశ్వాన్ని ప్రదక్షిణం చేసి రండి, ఎవరు ముందు వస్తారో చూద్దాము అన్నారు. మొదటి వాడైన గణపతి ఎక్కడికి పోలేదు. రెండవ కుమారుడైన సుబ్రహ్మణ్యుడు తన నెమలిని ఎక్కి సంచరించాడు. చాలా శ్రమపడి ప్రపంచాన్ని చుట్టుకొని వచ్చాడు. సుబ్రహ్మణ్యుడు కొంచెం దూరంలో వస్తున్నాడని తెలిసి తక్షణమే లేచాడు గణపతి. తల్లిదండ్రులకు ప్రదక్షణ చేసి కూర్చున్నాడు. తల్లి ఆశ్చర్యపడింది. 'గణపతీ! శ్రమ పడి చుట్టి వచ్చినవాడు సుబ్రహ్మణ్యుడు. నీవు ఎక్కడా కాలు కదపలేదు. పొట్ట కదలలేదు. గడప దాటలేదు. కాసు ఖర్చు కాలేదు. నీవు ఎట్లా జయించిన వాడౌతావు?' అని ప్రశ్నించింది. తల్లీ ఈ జగత్తంతయు శక్తి, పదార్థముల ఏకత్వమ్మే. తల్లిదండ్రుల ఏకత్వమే యీ జగత్తు. యిలాంటి తల్లిదండ్రులకు నేను ప్రదక్షణ చేసినప్పుడు జగత్తునంతా ప్రదక్షిణ చేసినవాడనౌతాను. ఎక్కడికి పోయినా మీరు తప్ప మరొకరు లేరు. **"సర్వతః పాణి పాదం తత్సర్వతోక్షి శిరోముఖం, సర్వతః శ్రుతిమల్లోకే సర్వ మావృత్య తిష్ఠతి"** ఎక్కడికి పోయినా మీరే ఉందేది. అటువంటి సర్వవ్యాపకులైన మీకు ప్రదక్షిణ చేయుట విశ్వానికి ప్రదక్షిణ చేసినట్టే. ఈ మాట వినగానే ఈశ్వరునికి చాలా ఆశ్చర్యం వేసింది. కుమారుడు చాలా తెలివితేటలు గలవాడు అన్నాడు. సత్యాన్ని గుర్తించుకున్నవాడు అన్నారు. అప్పుడు తాను చెప్పాడు 'వినాయకా! సర్వులకు ఆదర్శము నిరూపించే కుమారుడు నీవు. నాకంటే ముందు నిన్నే పూజిస్తారు. ఈశ్వరుడు తన స్వరూపాన్ని నిరూపిస్తూ వచ్చాడు.

srisathyasaivachanamrutam

మౌళిగుల్కెడు చంద్రమఖండ కళతోడ
బెడగారు గుల్కెడు జడలతోడ
జడలలో ప్రవహించు చదలేటి జిగితోడ
దంబైన ఫాల నేత్రంబు తోడ
నల్ల నేరేడువంటి నల్లని మెడతోడ
కరమున నాగ కంకణము తోడ
నడుమును చుట్టిన నాగ చర్మము తోడ
మైనిండ నలదు భస్మంబు తోడ
నుదట తీర్చిన దోడ్డకుంకుమ బొట్టుతో
తాంబూలరాగాధరమ్ము తోడ
ఆరు శాస్త్రములందున నందగించి
తటహేమమయబద్ధ తాటంకములతోడ
నల్ల కలువల హసియించి కొల్లలాడు
మెరుగు చామనచాయ మేని తోడ

యిలాంటి దేహాన్ని ధరించిన నాకంటే కూడను తెలివితేటలు నీ యందే అధికంగా ఉంటున్నాయి. కనుక శివపూజ కంటే గణపతి పూజ ముందు చేతురుగాక. ఈ వరాన్ని నీకు ప్రీతితో అందిస్తున్నాను అన్నాడు. అట్టి కుమారునకు తన కంటే అధికమైన స్థానాన్ని యిచ్చిన తండ్రి ఈశ్వరుడు. కనుక గణపతి అనగా సామాన్య తత్వము కాదు. సమస్త శక్తులతో కూడిన శరీరమే. సమస్త తెలివితోకూడిన స్వరూపమే. సరస్వతి తన పొట్టలోనే చేరి ఉంటున్నాది. ఆయన ఎక్కడ చేరిన ఏవిధమైన మార్పు రావటానికి వీలు లేదు. అలాంటి గణపతి యొక్క స్థానము సకలైశ్వర్య స్వరూపమైన స్థానము. ఇంతేకాక గణపతిని ప్రార్థించి ఏ కార్యము ప్రారంభము చేసినప్పటికి, ఆ కార్యమునకు విఘ్నములే కల్గవు. ఈనాడు అనేకమంది శ్రీమంతులు, ధనవంతులు, విద్యావంతులు, గుణవంతులు, గణపతి పూజ చేస్తుంటారు. విద్యార్థులు కూడా సరస్వతీ అనుగ్రహమునకు పాత్రులు కావాలని విద్యలో ఏవిధమైన అభ్యంతరములు కలుగకుండా ఉండాలని తమ పుస్తకములంతా వినాయకుని

ముందు పెట్టి పూజిస్తుంటారు. భారతదేశమునకే యీ సరస్వతి పేరును యిమిడ్చారు. భరత అంటే కేవలం రాముని తమ్ముడు పేరు భరతుడు అని పేరే ఈ రాజ్యమునకు పెట్టారు అనుకుంటున్నారు కదా చాలా పొరపాటు. ఇది ఎవరి పేరు కాదు. దైవము పేరే. ఎవరికైనా పేరు పెట్టారంటే ఆ పేరు ఉండాలి కదా ఎవరిదైనా ఒకటి. కానీ యిది ఎవ్వరికి పెట్టిన పేరు కాదు. ఏవిధంగా

**సరస్వతి నమస్తుభ్యం వరదే కామరూపిణి**
**విద్యారంభం కరిష్యామి సిద్ధిర్భవతుమే సదా**
**పద్మపత్ర విశాలాక్షి పద్మకేసరి వర్ణని**
**నిత్యం పద్మాలయాం దేవి సా మాంపాతు సరస్వతీ**
**భగవతీ భారతీ పూర్ణేందు బింబాననా**

**సిద్ధి - బుద్ధి సమేత గణపతి**

ఈ సరస్వతి పేరే భారతి. అనగా పరిపూర్ణ స్వరూపము యొక్క పేరే ఈ భారతి. ఎవరైనా గానము చేయాలంటే శృతి, రాగము, తాళము కావాలి. భారతి. భా అనగా కేవలం భాగ్యముతో కూడినది కాదు. భావముతో కూడినది. ర అనగా ఆ భావము రాగములో చేరినది. భావరాగతాళముతో కూడినది కనుకనే భారత అని పేరు పెట్టారు. కనుక ఈనాడు ప్రతి ఒక్కరు ఎవరైనా పాటలు పాడాలంటే, గానసభ జరపాలంటే ఒక సంగీతము ప్రారంభించాలంటే మొట్టమొదట గణపతిని ప్రార్థిస్తారు. 'వాతాపి గణపతిం భజేహం' మొట్టమొదట వాతాపి గణపతిని పూజించే సర్వశక్తులయందు అభివృద్ధి పొందుతారు. గణపతి అనగా కేవలం ఒక విధమైన కార్యమునకు, కర్మలకు, శుభములకు మాత్రమే కాదు. శుభాశుభములకు రెండింటికి గణపతే పతి. అశుభములు జరిగినా అతనికి శుభమే. శుభములు జరిగినా అతనికి శుభమే. అందరికీ శుభములు అందించేవాడు గణపతి. సకలైశ్వర్యములు అందించేవాడు గణపతి. బుద్ధి విజ్ఞానములు కల్గించేవాడు గణపతి. తెలివితేటలను పెంచేవాడు గణపతి. కనుకనే విద్యార్థులు మొట్టమొదట ఏవిధముగా ఉండాలంటే

srisathyasaivachanamrutam

**సద్గుణంబులు సద్బుద్ధి సత్యనిరతి**
**భక్తి క్రమశిక్ష కర్తవ్య పాలనములు**
**నేర్పునదె విద్య విద్యార్థి నేర్వవలయు**

అట్టి విద్యను నేర్పేవాడే గణపతి. దుర్విద్యలు నేర్పేవాడు కాదు. దురభ్యాసములు నేర్పేవాడు కాదు. కనుకనే సర్వులకు పతియైనవాడు గణపతి. ఇలాంటి గణపతిని ప్రతి నిత్యము ఏవిధంగా ప్రార్థన చేయాలి? ఓ భగవంతుడా నాకు ఈ కార్యము కావాలి, ఆ కార్యముకావాలి అని చెప్పికాదు. ఏ కార్యము వద్దు, నీవే నాకు కావాలి. గణపతి మనకు స్వాధీనమైతే సర్వమునకు పతి అయిపోతాము. బంగారం మన చేతిలో ఉంటే నెలవారి నగలు చేయించుకోవచ్చు. ఎన్ని ఆభరణములైనా చేయించుకోవచ్చును. కాబట్టి గణపతి సువర్ణమువంటివాడు. మనయొక్క భావములు కోరికలు యివన్నీ కొన్ని ఆభరణములవంటివి. మనం గణపతిని ఏదో చదువు కావాలి, ప్యాసుకావాలి, ఉద్యోగము చిక్కాలి. యిలాంటి కోరికలు కోరకూడదు. విఘ్నేశ్వరా! నా కార్యమునకు ఎట్టి విఘ్నములు కల్గకుండా చూచుకోవాలి. దాని నిమిత్తమై నేను నిన్ను పూజిస్తున్నాను అని ప్రార్థించాలి. ఈనాడు గణపతియొక్క తత్త్వము ఎవరు సరిగా అర్థము చేసుకోటం లేదు. కేవలం ప్రాకృతమైన స్వరూపమును మాత్రమే అర్థం చేసుకొని ప్రాకృతమైన పదములకు మాత్రమే అర్థమును బోధించు కుంటూ కాలమును వ్యర్థము చేస్తున్నారు గానీ అంతర్భావమును గుర్తించి అంతరార్థమును బోధించి నిజమైన శాంతి పొందే వ్యక్తులు చాలా తక్కువ. రామజన్మదినము ఒక పండుగగా చేసుకొని ఆనందాన్ని అనుభవిస్తున్నాము. రాముడంటే ఎవరు? ఆకారము మాత్రమే కాదు. అతని పవిత్రమైన గుణములే మనకు ఆధారము. రామభక్తులు కావాలనుకుంటే రామగుణములు మనం అలవర్చుకోవాలి. కృష్ణభక్తుడు కావాలనుకుంటే నిరంతరము ఆనందంగా నవ్వుతూ ఉండాలి. స్వామి భక్తులు కావాలంటే నిరంతరము ప్రేమమయులు కావాలి. అందరిని ప్రేమించాలి. ఎవరిని ద్వేషించకూడదు. అయితే ఒక్కొక్క పర్యాయము ప్రేమించకుండా ఉండినట్టు కనిపిస్తుంది. ఇది బాహ్యమైన ప్రాకృతిక దృష్టికి మాత్రమే. నిజంగా ప్రేమలోపల ఉన్నాది. మట్టిన పుట్టిన కుండలు ఎన్ని రకములుగా చేసినా అది మట్టే. బంగారుతో చేసిన నగలు ఎక్కడ చూచినా బంగారమే.

srisathyasaivachanamrutam

ఈవిధమైన భావమును మనము హృదయంలో చిత్రించుకోవాలి. పరిపూర్ణంగా విశ్వసించాలి. గణపతితత్వము చాలా గొప్ప అర్థముతో కూడినది. అతని రూపమే చాలా విచిత్రముగా ఉన్నాది. కనుక చెప్పాడు భాగవతములో

**చిత్రంబులు త్రైలోక్య ప**
**విత్రంబులు భవలతాల విత్రంబులు**
**సన్మిత్రంబులు ముని జనవన**
**చైత్రంబులు విష్ణు దేవు చారిత్రంబుల్.**

దైవ చరిత్రములు చాలా విచిత్రమైనవి. ఆ విచిత్రములోనే తన చరిత్రలంతా యిమిడి ఉంటున్నాయి. ఏ ఒక్క పదముగానీ, ఏ ఒక్క అడుగుగానీ అర్థరహితము అయినది ఎక్కడా ఉండదు. భగవంతుడు ఏది చెప్పినా అది అర్థసహితమైనదే. పవిత్రమైన అర్థము కలిగినదే. సాయినాథ్ చెప్పాడు. ఎవరో పోతుంటే కాచుకొని ఉండు అన్నాను. స్వామి wait అన్నాడు. కానీ ఆ wait చేయటానికే అతనకి ఓపిక లేక టిక్కెట్టు తీసుకొని వెళ్లిపోయాడు. కానీ అక్కడ పోయి నెలలకొద్దీ wait చేశాడు. అతను ఎంత wait చేసినా ఫలించలేదు. తిరిగి వచ్చాడు. 'అయ్యా! నేను వద్దంటే ఎందుకు వెళ్లావు? అన్నాను. ప్రతి దానియందు ఒక అంతరార్థము ఉన్నాది. కానీ కొంతమంది వెఱ్ఱిగా దాన్ని పాటిస్తుంటారు. ఇప్పుడు కొంతమంది కూర్చొని ఉంటారు. నేను మధ్యలో వెడుతుంటాను. వారేదో అడుగుతుంటారు స్వామి నాకు యిది కావాలి, అది కావాలి అని అడుగుతుంటారు. Wait, wait, sitdown అంటాను. వారు అనుకుంటారు నేను యిక్కడ కూర్చొని wait చేయాలని స్వామి అన్నారనుకుంటారు. అందరూ వెళ్లినా కూర్చుంటాడు. నేను సహజంగా లేచినప్పుడు కూర్చో అంటాను. తొందరపడవద్దు. వేచి ఉండు అంటాను. ఆ అర్థమును వారు యింకొక రకముగా తీసుకుని అందరు పోయినప్పటికి వారు కూర్చునే ఉంటారు. ఇవన్నియు మూర్ఖమైన అర్థాలు. సమయసందర్భాలు పురస్కరించుకొని ఆ అర్థాలు తెలుసుకోవాలి. దేశకాల పరిస్థితుల ప్రభావమును పురస్కరించుకోవాలి. ఆస్తికులందరు వినాయకుని అనేక రకములుగా పూజిస్తుంటారు. ఏవిధంగా

sri sathyasai vachanamrutam

**శుక్లాం బరధరం విష్ణుం శశివర్ణం చతుర్భుజమ్**
**ప్రసన్న వదనం ధ్యాయేత్ సర్వ విఘ్నోపశాంతయే.**

అని పూజిస్తారు. శుక్లాంబరధరమ్ అంటే తెల్లని వస్త్రములు ధరించిన వాడు. విష్ణుః - సర్వత్రా ఎక్కడ చూచినా కనిపించేవాడు. చతుర్భుజం - నాలుగు చేతులుంటున్నాయి. ప్రసన్నవదనం - ఆ ముఖము చాలా ప్రసన్నంగా ఉంటున్నది. అటువంటి రీతిగా భక్తుడు పూజిస్తుంటే దీనిని నాస్తికులు యింకొక అర్ధంగా తీసుకుంటారు. శుక్లాంబరధరం అనగా తెల్లని వస్త్రాలు మోసేది గాడిద అంటున్నారు. చూశారా! ఎంతటి అనర్థాన్ని తీసుకున్నారో. చతుర్భుజం అనగా నాలుగు పాదములుండేది గాడిదే అని విపరీతార్థాన్ని తీసుకున్నారు. యీ శ్లోకాన్ని గాడిదకు పోల్చుకున్నారు వారు. కానీ వీరు గాడిదల్లాంటి వారు కనుకనే గాడిదతో పోల్చుకున్నారు. యద్భావం తద్భవతి. వారియొక్క భావములను పురస్కరించుకొనియే వారికి భావములు. ఈవిధంగా ఒక్కొక్కరు ఒక్కొక్క అర్థాన్ని తీసుకుని ఆ అర్థాన్ని అనర్థం గావించి, అనర్థాల్లో నానార్థములుగా పెంచి నానార్థములలో యదార్థము వదలి అనర్థాన్ని మాత్రమే తీసుకుంటారు. అనర్థములు తీసుకుని అవస్థలు పడేవారు కొందరు. పవిత్రాన్ని తీసుకుని ఆనందించేవారు కొందరు. అదేవిధముగా భగవంతుని శక్తి సామర్థ్యములు చక్కగా అర్థము చేసుకున్నప్పుడు అణు స్వరూపుడే భగవంతుడు. దీనినే గోపికలు ఆనాడు చెప్పారు.

**అణుశక్తి- భగవత్ శక్తి**

**అణువు కంటె అతి సూక్ష్మరూపుడవు**
**ఘనము కంటె అతి ఘననీయుడవు**
**ఎనుబది నాలుగు లక్ష జీవముల అనయంబున**
**నెడబాయకుందువట**
**అణువురేణు తృణకాష్టము మొదలుగ**
**అఖండ రూపుడవై వెలయుదువట**
**నిను కనుగొనగలమా కృష్ణా.**

sri sathyasai vachanamrutam

ఈవిధంగా దైవతత్త్వాన్ని ఎవరు ఎవరు వారి శక్తి సామర్థ్యములకు తగినట్లుగా అనుసరిస్తూ ఆచరిస్తూ అర్థము చేసుకుంటూ వస్తున్నారు. కానీ గణపతి విషయములో మాత్రము ఆస్తికులుగాని, నాస్తికులుగాని, సైంటిస్టులు గానీ, సెయింట్స్ గానీ, అందరికీ ఒకే భావము వుండాలి. సర్వత్రా అణుశక్తి ఉన్నాది. ఈ అణుశక్తి లేకుండా జగత్తులో ఏ పదార్థము ఉండటానికి వీలులేదు. ఇదంతా ఎక్కడనుండి వచ్చింది. ఇది మూలాధారమైన శక్తి దైవత్వమే. భద్రాచలములో రామదాసు, రాముని కొల్చుకుంటూ, ప్రార్థించుకుంటూ చెప్పాడు.

**అంతా రామమయం ఈ జగమంతా రామమయం**

ఎక్కడ చూచినా రామమయమే. రాముడు లేని స్థానము లేదే. అణువు లేని స్థానము లేదే. కాబట్టి సర్వత్రా అణుశక్తి ఉన్నాది. సర్వత్రా రామశక్తి ఉన్నాది. అయితే ఆ రామశక్తిని తెలుసుకోవాలంటే ఏవిధంగా తెలుసుకోవాలి? జ్యోతిర్మయస్వరూపుడు కావాలి.

**పాటువైనది చెట్టురా - పట్టువైనది కొమ్మరా**
**పాటు తప్పి పట్టు విడిచితె - పరబ్రహ్మము చేరురా**
**రామ భజన చేయరా - రాజ్యమంతా వెలుగురా**
**సారమైనది చమురురా - సత్యమైనది వత్తిరా**
**వెలుగు తీరి వెళ్ళి పోయేటప్పుడు వెంట ఎవ్వరు రారురా**

ఇలాంటి తత్వము జ్యోతి. సారము నూనె. సత్యము వత్తి. ఇవి కలుస్తే వెలుతురు వస్తుంది. పోయేటప్పుడు వెలుతురు రాదు, ఎవరూ కూడా రారు.

**కోటఏడుచుట్టురా - కోట లోపల తోటరా**

ఏడు ప్రాకారములున్నాయి. లోపల తోట ఉన్నాది. అదియే సప్త స్వరములు. దానిమధ్యలో దైవత్వమనే తోట ఉన్నాది.

**తోటలోనికి పోదామంటే దారి తెలియదు ఎట్లరా?**

కోటలు తెలుసు. కానీ లోపల వున్న తోటకు వెళ్ళటానికి దారి తెలియటం లేదు. ఈ విధంగా భక్తులు ఒక్కొక్కరు వారి ఉద్దేశ్యమును పురస్కరించుకొని దైవత్వమును అంత రహస్యంగా

srisathyasaivacharamrutam.

ప్రబోధిస్తూ వచ్చారు. అభిమన్యుడు యుద్ధములో ప్రవేశించాడు. కానీ పోవటం మాత్రమే తెలుసు అతనికి. తిరిగి రావటం తెలీదు. తెలియకుండా పోవటం వలన అక్కడ ప్రాణాలు కోల్పోయాడు. అదేవిధముగా కోట ఏడు చుట్లు ఉంటున్నాయని తెలుసు. కాని దారి తెలియకుండా ఉన్నాది. ఆ దారియే ప్రేమ. ఈ ప్రేమతో ఎక్కడైనా మనం ప్రయాణం చేయవచ్చును. ప్రేమతో ఎక్కడైనా మనం ప్రవేశింప వచ్చును. కనుకనే Love is God. Live in love.

Start the day with love
Spend the day with love
Fill the day with love
End the day with love
This is the way to God

**దేవుని వద్దకు దగ్గరి ప్రయాణం**

ప్రేమతో start చేయి. ప్రేమతో end చేయి. రెండింటి మధ్యలో ప్రేమమయమే. ఈ ప్రేమను ఏ రీతిగా మనం ప్రేమను పెంచుకోవాలి. ప్రేమను పెంచాలంటే మరొక మార్గము లేదు. ప్రేమను ప్రేమచేతనే పెంచాలి. ఒక మొక్కను నాటాము. ఆ మొక్క పెద్దదై పండ్లు యివ్వాలంటే నాటినంత మాత్రమున చాలదు. నీరుపోయాలి. ఎరువు వేయాలి. ఈ రెండు వేసినప్పుడే చెట్టు పెరుగుతూ వస్తుంది. కానీ యీనాటి ఆధునిక పురుషులుగానీ, స్త్రీలుగానీ, పిల్లలుగానీ చెట్టు పెరగాలంటే ఏమి చేస్తున్నారు. చెట్టు నాటుతారు. దినము పొగ పెడుతారు. అది చచ్చిపోతుంది. పెరగాలంటే ఏమి చేయాలి. ఎరువు వేయాలి. నీరు పోయాలి. విశ్వాసమనే ఎరువు వేయాలి. ప్రేమ అనే జలము పోయాలి. ఈ ప్రేమ విశ్వాసముల వలనే ఆ ప్రేమ అనే చెట్టు పెరుగుతుంది. పెద్దదౌతుంది. ఫలపుష్పముల నందిస్తుంది. మనం జగత్తులో అనుకుంటున్నాం. తల్లిదండ్రులు మనకోసం ఎంతో పాటుపడుతున్నారని. మాతృదేవోభవ, పితృదేవోభవ అంటున్నాము. తల్లిదండ్రులు దైవస్వరూపులే. కానీ వారి వారి పరిస్థితి ప్రభావమును పురస్కరించుకొని ఒక్కొక్క

sri sathyasai vachanamrutam

సమయములో దానికి విరుద్ధముగా పోతుంటారు. ఎవరు నీవారు? ఒక తెలివితేటలు గల విద్యార్థి సమీపములోనున్న ఆశ్రమానికి వెళ్లాడు. ఆశ్రమములోని స్వాములవారు అనేకవిధములైన ప్రబోధలు సల్పుతున్నారు. ఈ లోపల వర్షం వచ్చింది. చీకటి పడింది. ఆ పిల్లవాడు యింటికి పోలేకపోయాడు. అప్పుడు చెప్పాడు ఈ స్వామి 'నాయనా! చీకటి పడింది. వర్షము కురుస్తున్నాది. నీవు యింటికి వెళ్లలేవు. ఈ రాత్రికి యిక్కడే పడుకో' అన్నాడు. ఆ పిల్లవాడు చెప్పాడు. స్వామీ నా తల్లిదండ్రులు నేను యింటికి పోకపోతేవారు నిద్రపోరు. భోజనం చేయరు. నాకు భార్య కూడా ఉన్నాది. ఆమె కూడా నిద్రపోదు, భోజనం చేయదు. వీరందరు చాలా అవస్థలకు గురౌతారు. కనుక నేను ఇంటికి పోతాను అన్నాడు. 'పిచ్చివాడా! నీవు ఈ విధంగా అనుకుంటున్నావు. ప్రాకృతమైన ప్రేమలు అందరికి ఉంటాయి. వారికి ఉంటన్నాయి. కానీ నిజమైన ప్రేమ ఎవ్వరికీ లేదు. పెంచినారు, పెద్ద చేసినారు కనుక దేహతత్వానికి సంబంధించిన ప్రేమ మాత్రమే ఉంటుంది. అప్పుడు అడిగాడు ఎక్కడనుండి వచ్చావని. నేను జితేంద్రియ రాజ్యము నుండి వచ్చాను. మా రాజ్యము పేరు జితేంద్రియ రాజ్యము. నా తండ్రి జితేంద్రియుడు. నా పేరు మోహచంద్రుడు. సత్యజిత్ వానిని సాధించినాను అన్నాడు. నేను ఇంటికి వేళ్లే తీరాలి. నా తల్లిదండ్రులు చాలా బాధపడుతుంటారు అన్నాడు. ఈ ఒక్కరాత్రి లోపలనే నీ తల్లిదండ్రుల ప్రేమ గుర్తించుకో, చక్కగా అర్థము చేసుకోమన్నాడు. ఈ పిల్లవాడు పట్టిన పట్టు విడువలేదు. వెళ్లే తీరాలి అన్నాడు. వెళ్లు సంతోషమే. నీ తల్లిదండ్రులకు ఆనందము నిచ్చేసేయి. కని పెంచి పెద్ద చేసిన వారు వాళ్లే. అయితే నీకు కొన్ని విధములైన బోధలు చేస్తున్నాను. ఈ బోధను చక్కగా పరీక్ష చేయమన్నాడు. ఒక మాత్ర యిచ్చాడు. యింటికి వెడుతూనే నోట్లో వేసుకుని నీరు త్రాగమన్నాడు. నీవు మరణించినట్లుగా పడిపోతావు. కానీ మరణించవు. వారు ఏమేమి చెబుతున్నారో నీకు వినిపించే శక్తి నేను యిస్తానన్నాడు. సరే చూస్తానని వెళ్లాడు. భోజనం చేశాడు మాత్ర నోట్లో వేసుకుని నీరు త్రాగాడు. తక్షణమే పడిపోయాడు. మరణించినట్లుగా కనిపించింది. తల్లి, తండ్రి, భార్య, మిత్రులు అందరు అక్కడ చేరిపోయారు. ఎక్కడకు పోయినాడో ఏ ఆశ్రమానికి పోయాడో ఏమిటో? చాలా బాధగా ఉన్నాడని అరుస్తున్నారు. ఆ సమయానికి సరిగా ఆ స్వామి వచ్చాడు. అమ్మా మీరు

sri sathyasai vahini amrutam

ఎందుకు ఏడుస్తున్నారు? యిప్పుడే నా ఆశ్రమము నుండి వచ్చాడే యీ పిల్లవాడు. ఏమి జరిగింది. ఎందుకోసం ఈవిధంగా మరణించాడు. మాకు తెలియదు స్వామీ మీ ఆశ్రమం నుండి వస్తూనే భోజనం చేశాడు, మరణించాడు. మీరే ఏమి చేశారో ఏమిటో అని స్వామిపైనే నింద వేస్తూ వచ్చారు. 'చాలా పొరబాటుపడుతున్నారు. కొంచెం ఓపిక పట్టండి. నేను యితన్ని బ్రతికిస్తాను అన్నాడు. అయ్యో బ్రతికిస్తే అంతకంటే ఇంక ఏమి కావలెను అని భార్య తల్లిదండ్రులు అందరు సంతోషించారు. ఒక మాట చెప్పాడు. ఈ గ్లాసు నీరు తీసుకోండి. ఈ జలము ఎవరు త్రాగుదురో వారు మరణిస్తారు. పిల్లవాడు బ్రతుకుతాడు అన్నాడు. తండ్రి దగ్గరకు తీసుకువెళ్లాడు. రాజా! నీకు రాజు కావాలన్నప్పుడు కొడుకు కావాలి. నీవు త్రాగి నీ ప్రాణం విడుచు. నీ కుమారుడు బ్రతుకుతాడు అన్నాడు. అప్పుడు తండ్రి చెప్పాడు 'స్వామీజీ నాకు యింకా పిల్లలున్నారు. వీరినందరిని ఎవరు చూచుకుంటారు. ఇంత పెద్ద రాజ్యాన్ని ఎవరు పాలిస్తారు. దీన్ని ఎవరు అర్ధం చేసుకుంటారు. వీడు యింకా చిన్నవాడు కదా నేను చావటానికి వీలు లేదు అన్నాడు. తల్లి దగ్గరకు వెళ్లాడు. మాతృమనస్సు కదా నీవు ఈ నీరు త్రాగి నీకుమారుని బ్రతికించుకోమన్నాడు. అయ్యో నాకింకా ఆడబిడ్డలున్నారు వారికంతా పెండ్లిండ్లు కావాలి. ఎన్నో పనులుంటున్నాయి. నేను స్త్రీనై యింటిలో లేకపోతే యీ పనులేవీ జరుగవు. ఆడవారు లేకపోతే యిల్లు అడివైపోతుంది. నేను తాగను అన్నాది. సరే మీరిద్దరు అంగీకరించకపోయినా భార్య తప్పక అంగీకరిస్తుందని అనుకున్నాడు. ఆమె దగ్గరకు వెళ్లాడు. అమ్మా నీకీవిధమైన widow స్థితి ప్రారంభమైంది. విధవ కాబోతున్నావు. నీ భర్త ప్రాణము కోల్పోయినాడు. యితను ప్రాణము విడిచాడు. మీరు త్రాగండి, భర్త బ్రతుకుతాడు అన్నాడు. ఆమె చెప్పింది. నా తల్లికి నేను ఒక్కదాన్నే బిడ్డను. నేను మరణిస్తే నా తల్లిదండ్రులిద్దరూ మరణిస్తారు. నా ఆస్తి ఏమైపోతుందో ఏమిటో? ఈ నీటిని నేను త్రాగను అనింది. ముగ్గురు లోపలకు వెళ్లారు. ముగ్గురు ఏమి ప్లాను వేశారో, విశ్వేశ్వరయ్య ప్లాను. ముగ్గురు వచ్చి నమస్కారం చేసారు. స్వామీ మాకంతా ఎన్నో బంధనలున్నాయి. మీకు ఏ బంధనా లేదు కదా. ఏవిధమైన బాధ్యత లేదు. కనుక మీరే త్రాగి నా కుమారుని బ్రతికించండి. యింతే కాదు, తల్లి చెబుతున్నాది. స్వామీ మీ సమాధి మార్బుల్ స్టోనుతో

sri sathyasai vahanmrutam

కట్టిస్తాము. మీ మార్బుల్ విగ్రహమే పెట్టిస్తాము. ఈవిధంగా భవిష్యత్తుకు ఎన్ని ఆశలు పెట్టాలో అన్ని ఆశలు చూపారు. తక్షణమే గురువు పిల్లవానిని లెమ్మన్నాడు పిల్లవాడు లేచాడు. వీరు చెప్పినవి విన్నాను. మీరు చెప్పింది పరమ సత్యము గురువుగారు అన్నాడు.

**మాతానాస్తి పితానాస్తి నాస్తి బంధు సహోదరః**

**అర్థం నాస్తి గృహంనాస్తి తస్మాత్ జాగ్రత జాగ్రత** అని తెలుసుకున్నాడు.

## ప్రాకృత ప్రేమ - దివ్యప్రేమ

ప్రాకృత ప్రేమలుంటాయి తల్లిదండ్రులకు. కానీ దివ్యమైన ప్రేమ భగవంతునికి తప్ప ఎవరికి ఉండదు. యిలాంటి ప్రేమ నాకు కావాలి కానీ బంధుప్రేమ నాకు అక్కరలేదు. ఆవిధంగా యీ లోకములో అందరు ప్రేమించినట్టుగానే కనిపిస్తారు. కానీ ఏది ప్రేమయో, ఏది ప్రేమ కాదో మనం గుర్తించుకోటానికి వీలుకాదు. అయినప్పటికి తల్లిదండ్రులకు ప్రేమ ఉంటుంది. వారిని మనం ఆనందపెట్టాలి. సాధ్యమైనంతవరకు వారిని సంతృప్తి పరచటానికి ప్రయత్నం చేయాలి. కానీ దైవప్రేమను మరువకుండా చూచుకోవాలి. అదియే శాశ్వతమైంది. అదే సత్యమైనది. అదే నిత్యమైనది. ఈనాడు ప్రేమించిన తల్లిదండ్రులు మరణించవచ్చు. దైవమునకు మరణము లేదు. అమృతస్వరూపుడైనవాడు దైవము. అట్టి దైవాన్ని మనం నిరంతరము ప్రేమించాలి. దానితోబాటు తల్లిదండ్రులను ప్రేమించండి. బంధుమిత్రులను ప్రేమించండి. సర్వమును ప్రేమించండి. అయితే దైవమును చలించని రీతిగా ప్రేమించాలి. ఆ నిత్యసత్యమైన ప్రేమను మనం ఎప్పుడూ అభివృద్ధి పరచుకోవాలి. అట్టి ప్రేమయే దైవస్వరూపము. అట్టి ప్రేమయే గణపతి స్వరూపము. అట్టి ప్రేమయే విఘ్నేశ్వర స్వరూపము. అట్టి ప్రేమయే సర్వస్వరూపము. నీ స్వరూపము కూడా భగవంతుని స్వరూపమే. నీవు నిన్ను భగవంతుడవని భావించుకో. నీకేమీ తప్పులేదు. శారీరకంగా మానవుడవే గానీ ఆత్మదృష్టిలో నీవు దైవమే. అహం బ్రహ్మాస్మి అనే భావంతో నీవు జీవించు. రాముడు హనుమంతుని ఒక పర్యాయము పిలిచాడు, "హనుమా! నీవు ఏరీతిగా నన్ను ఆరాధన చేస్తున్నావు?" అని అడిగాడు. "స్వామీ! దేహరీతిగా నేను మీ దాసుడను, నాకు మీరు ప్రభువు. జీవబుద్ధితో విచారిస్తే నేను మీ అంశమును. కానీ

sri sathyasai vachanamrutam

ఆత్మరీతిలో మనమిద్దరం ఒకటే" అన్నాడు. ఈవిధంగా మూడు రకములైన భావాలతో మనం ప్రేమిస్తున్నాం. ఈ మూడు రకములు మంచివే. కానీ కట్టకడపటికి మనమిద్దరం ఒకటే అనే సత్యానికి రావాలి. దేహాలు వేరు వేరు కావచ్చు గానీ ఆత్మ ఒక్కటే. 'ఏకం సత్ విప్రా బహుదా వదంతి' అని శాస్త్ర ప్రమాణము. విఘ్నేశ్వరుని పండుగ సర్వ సామాన్యముగా మనం భావిస్తున్నాము. కానీ సమస్త దేవతల స్వరూపము, సమస్తదేవతల శక్తిమత్వము అంతా విఘ్నేశ్వరునియందే ఉన్నాది. మనం యీనాడు మాత్రమే పండుగ చేసుకుంటే ప్రయోజనం లేదు. నిరంతరము పూజిస్తూ రావాలి. భగవంతుని క్షణక్షణము ప్రార్థన చేయాలి. దీనిని పురస్కరించుకొనియే సర్వకర్మ భగవత్ప్రీత్యార్థం చేస్తున్నాననుకో. ఏదైనా ఒక వస్తువు యొక్క తృప్తి కోసం చేస్తున్నామనుకొంటాము. చాలా పొరపాటు. ఏది చేసినా నీ తృప్తికోసం నీవు చేస్తున్నావు. అంతే కానీ పదార్థ తృప్తికోసం కాదు. పదార్థతృప్తికోసం ఎవరూ చేయటం లేదు. నేను ఒక apple కొనుక్కొని తినాలి అనుకున్నావు. Apple తృప్తికోసం apple తింటున్నావా? కానీ నీ తృప్తికోసం నీవు apple తింటున్నావు. నేను యిప్పుడు మందిరానికి వెడుతున్నాను. White dress వేసుకోవాలనుకుంటున్నావు. డ్రస్సుకోసం నీవు white dress వేసుకుంటున్నావా? నీ కోసం నీవు white dress వేసుకుంటున్నావు. అదేవిధంగా ప్రతి కార్యము నీ తృప్తికోసం నీవు చేస్తున్నావే గానీ యింకో పదార్థము తృప్తికోసం కాదు. కనుక ఏ పనిచేసినా దైవప్రేమతో నీ పనులు చేయి. దైవప్రేమ సర్వమును సిద్ధింప చేస్తుంది. సర్వమునకు విజయాన్నందిస్తుంది. సర్వము నీకు ఆరోగ్యాన్ని ఆనందాన్ని చేకూరుస్తుంది. సర్వము భగవంతునిగానే భావించుకో.

**(తేదీ 25-08-1998న కుల్వంత్‌హాల్‌లో భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము) వినాయక**

sri sathyasai vachanamrutam